నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ శ్రీనివాస రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు బాలాజీనగర్, ఆర్‌బీఆర్ కాంప్లెక్స్, లేక్‌వ్యూ కాలనీ, మియాపూర్ మెయిన్ రోడ్డు, ఎక్స్ రోడ్డు, ఈ సేవా మెయిన్ రోడ్డు, రాయ్ అపార్ట్‌మెంట్స్, వడ్డెర బస్తీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

కిట్‌ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి సమతానగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో మంగళవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పీపీఈ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఈ కిట్‌లో 11 రకాల సామాన్లు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకుని కార్మికులు వారి ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు.

వ్యక్తి అదృశ్యం



చంద్రశేఖర్ రెడ్డి (ఫైల్)

మియాపూర్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా తమ్మలూరు గ్రామానికి చెందిన ఆకుమల్ల చంద్రశేఖర్ రెడ్డి(26) మియాపూర్‌లోని గోపాల్‌నగర్ కాలనీలో ఓ డెయిరీఫాంలో నాలుగు నెలలుగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 12వ తేదిన సాయంత్రం 5 గంటలకు ఊరికి వెళ్తున్నానని వెళ్లాడు. చంద్రశేఖర్ తన తండ్రికి ఫోన్‌చేసి తెలిపాడు. రెండు రోజులు అయినా చంద్రశేఖర్ రాకపోవడం, ఇక్కడ డెయిరీకి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆందోళన చెందిన సోదరులు చిన్నాన్న కుమారుడు రవీందర్ రెడ్డి మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఫుట్‌వేర్ రంగంలో అవకాశాలు మెండు

ఎఫ్‌డీడీఐ ఈడీ డా.తేజ్‌లోహిత్‌రెడ్డి

రాయదుర్గం: భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలలో ఫుట్‌వేర్ రంగం ఒకటని, అవకాశాలు మెండుగా ఉన్నాయని ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ తేజ్‌లోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయదుర్గంలోని క్యాంపస్‌లో మంగళవారం 2025-26 విద్యాసంవత్సరంలో నూతనంగా చేరిన విద్యార్థులు, తల్లిదండ్రులతో ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు వినూత్న ఆలోచనలు, నూతన ఆవిష్కరణల వైపు దృష్టి సారించేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ పనిచేస్తుందన్నారు. ఫుట్‌వేర్ డిజైన్, ఫ్యాషన్, తోలు వస్తువులు, రిటైల్ నిర్వహణ రంగాలలో పరిశ్రమకు సిద్ధంగా ఉన్న నిపుణులను పెంపొందించడంలో సంస్థ పాత్రను ఆయన వివరించారు. సంస్థ పురోగతిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ, అధికారులు పాల్గొన్నారు. అనంతరం యూజీ, పీజీ కోర్సులలో చేరిన విద్యార్థులు, తల్లిదండ్రులు క్యాంపస్‌ను పరిశీలించారు.



ఓరియంటేషన్ కార్యక్రమంలో పేర్లు నమోదు చేయించుకుంటున్న విద్యార్థులు

బోనాల సందడి

కిటకిటలాడిన రేణుకా ఎల్లమ్మ ఆలయం

రాయదుర్గం: ఆషాడమాసాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ రోడ్డులో వెలసిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బోనాల సందడి నెలకొంది. భక్తులు ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అమ్మవారికి మొక్కలు సమర్పించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు.

నల్లగండ్ల మార్కెట్‌లో..

శేరిలింగంపల్లి: నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌లో ఎల్లమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా డప్పు చప్పుళ్ళ నడుమ పోతురాజుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ అధ్యక్షుడు వీరేశంగౌడ్, ఉపాధ్యక్షుడు ఖాజాపాషా, మోయిజ్, డి శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, శ్యామలరాజు, లాల, రాంచందర్, అస్లామ్, అజీమ్ మార్కెట్ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్



డ్రైనేజీ పైప్‌లైన్ పనులు పరిశీలన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ బి.పుష్ప అన్నారు. మంగళవారం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్ కాలనీ 10వబ్లాక్‌లో ఆమె పర్యటించారు. నూతనంగా పూర్తి చేసిన డ్రైనేజ్ పైప్‌లైన్ పనులను ఆమె పరిశీలించారు. పనులు పూర్తయ్యాయి కనుక రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, వడ్డేర లింగయ్య, నరసింహ ఉన్నారు.

పూర్తిస్థాయిలో రహదారుల అభివృద్ధి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిల్ పరిధిలో పూర్తిస్థాయిలో రహదారులను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరులో బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో కొత్త కాలనీలు వస్తున్నాయని అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. ప్రధానంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములుగౌడ్, కొల్లూరు మాజీ ఉప సర్పంచ్ రాజుగౌడ్, మాజీ కౌన్సిలర్‌లు రాంసింగ్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చందానగర్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. సోమవారం చందానగర్ ఫ్లైఓవర్ వద్ద ఓ వ్యక్తి (50) అపస్మారక స్థితిలో కింద పడిపోయి ఉన్నాడు. దీనిని గమనించిన వాహనదారులు వెంటనే చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని పరిశీలించి చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఆ వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాపు చేపట్టారు.

కలుషిత నీటి సమస్య పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. శేరిలింగంపల్లి గోపీనగర్‌లో మంచినీటిలో మురుగునీరు కలుస్తుందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా, వాటర్‌వర్క్స్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మంచినీటిని తాగాలని సూచించారు. కలుషిత నీటి సమస్య పరిష్కారానికి పాడైన మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్లను గుర్తించి కొత్తలైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ డీఈ నరేందర్‌రెడ్డి, సెక్షన్ మేనేజర్ అభిషేక్ రెడ్డి, ఏఈ భాస్కర్, నాయకులు రవీందర్‌గౌడ్, శ్రీకాంత్, నర్సింహారెడ్డి, ప్రభాకర్, మహేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



గోపీనగర్‌లో సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్, అధికారులు

నూతన రేషన్‌కార్డుల పంపిణీపై సమీక్ష



తహసీల్దార్‌లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అర్హులైన లబ్ధిదారులందరికీ ఆహార భద్రత అందించాలన్న సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నూతన రేషన్‌కార్డులు అందిస్తుందని.. ఈ నెల 29వ తేదీన పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అందజేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయా మండలాల తహసీల్దార్లతో నూతన రేషన్ కార్డుల పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గ పరిధిలోని గుమ్మడిదల, జిన్నారం, అమీన్‌పూర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం రెవెన్యూ మండలాల పరిధిలో నూతన రేషన్ కార్డుల కోసం 9,414 దరఖాస్తులు రాగా.. 2,096 నూతన రేషన్ కార్డులు పంపిణీకి సిద్ధం చేశామని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గం వ్యాప్తంగా 74,214 రేషన్ కార్డులు వినియోగంలో ఉన్నాయని తెలిపారు. నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని.. అర్హులైన ప్రతి ఒక్కరూ మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రేషన్ కార్డుల ద్వారా బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు లేకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్లు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాములు గౌడ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సూత్ర ఫ్యాషన్ ఎగ్జిబిషన్ షురూ

లక్డీకాపూల్: ఇండియన్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ సూత్ర.. ప్రత్యేక సంప్రదాయ వస్త్ర ప్రదర్శన తాజ్ కృష్ణా హోటల్‌లో మంగళవారం ప్రారంభమైంది. ఈనెల 24 వరకు కొనసాగే ప్రదర్శనలో శ్రావణమాసం శుక్రవారాలు, వరలక్ష్మీ వ్రతం, రాఖీ వేడుకల కోసం దేశంలోని ప్రముఖ ఫ్యాషన్, సాంప్రదాయత కలబోసిన ప్రత్యేక వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. అంతేగాకుండా ఫ్యాషన్ ఉపకరణాలు, ఆభరణాలు, అలంకరణ సామగ్రి, గిఫ్ట్ ఆర్టికల్స్, గృహాలంకరణ బ్రాండ్‌ల శ్రేణిని ప్రదర్శిస్తుందన్నారు. మైసూర్ శారీ ఉద్యోగ్-సమకాలీన శైలితో కలకాలం నిలిచే లెగసీ-రిచ్ చీరలు, మోడీ జ్యువెలర్స్-పండుగ సందర్భాలకు అనువైన ఆభరణాలు, ఉష్వీ-పండుగలకు ప్రత్యేకం, హియా క్రియేషన్-ఇండో-వెస్ట్రన్ శైలి దుస్తులు, వీపీజీ జ్యువెలరీ ప్యూర్ గోల్డ్- స్వచ్ఛత నిండిన బంగారు ఆభరణాలు, అనురాగ్ గోల్డ్ జ్యువెలరీ-సంప్రదాయం ఆధునికత జోడించిన డిజైన్లు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

